క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మాకవరపాలెం: మండలంలో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని డీఈ రామకృష్ణ తెలిపారు. మాకవరపాలెంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతుల్లో భాగంగా సరఫరా నిలిపివేస్తామన్నారు. మాకవరపాలెం, శెట్టిటపాలెం, గిడుతూరు, బూరుగుపాలెం, జి.కోడూరు, లచ్చన్నపాలెం ఫీడర్ల పరిధిలో ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తామని, వినియోగదారులు గమనించాలని సూచించారు.

ముగిసిన ముత్యమాంబ మాలధారణ దీక్షలు



పురవీధుల్లో ఊరేగింపు చేస్తున్న ముత్యమాంబ మాలధారణ భక్తులు

మాడుగుల రూరల్: కె.జె.పురంలో ముత్యమాంబ మాలధారణ దీక్షలు శనివారంతో ముగిశాయి. ఈ నెల 20న మాలాధారణ వేసిన భక్తులు దీక్షలు తొమ్మిది రోజులు పూర్తి కావడంతో ఆలయం నుంచి ఊరేగింపుగా పురవీధుల్లో తిరిగారు. అనంతరం ఆలయం వద్ద మాలాధారణ విడిచారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆడారి బాబ్జి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

సత్యవరంలో బాల ఆధార్ నమోదు



చిన్నారులకు ఆధార్ నమోదు చేస్తున్న దృశ్యం

మాడుగుల: సత్యవరం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం బాల ఆధార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 20 మంది చిన్నారులకు ఆధార్ నమోదు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విశాలక్ష్మి, మహిళా పోలీసు నూకరత్నం, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన తప్పనిసరి

- సీనియర్ సివిల్ జడ్జి గౌరీశంకర్



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి గౌరీశంకర్

చోడవరం: మహిళల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్, చోడవరం సీనియర్ సివిల్ జడ్జి వి. గౌరీశంకర్ తెలిపారు. 'విధాన్‌సే సమాధాన్'లో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు శనివారం జరిగింది. న్యాయమూర్తి గౌరీశంకర్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. మహిళల కోసం ప్రత్యేక చట్టాలు రూపొందించారని, వాటిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీవో కె. అనంతలక్ష్మి, ఎస్ఐ జోగారావు, న్యాయవాది కొలగాని సతీష్ పాల్గొన్నారు.

బోడ్డేరు కాజ్‌వేపై గడ్డి ట్రాక్టర్ బోల్తా

- రెండు గంటల పాటు ట్రాఫిక్ జామ్



కాజ్‌వే మీద బోల్తా పడిన గడ్డి ట్రాక్టర్

బుచ్చెయ్యపేట: విజయరామరాజుపేట వద్ద బొడ్డేరు నదిపై నిర్మించిన తాత్కాలిక కాజ్‌వే మీద శుక్రవారం సాయంత్రం గడ్డి ట్రాక్టర్ బోల్తా పడింది. దీంతో సుమారు రెండు గంటలు సేపు ట్రాఫిక్ జామ్ అయింది. ఇరువైపులా వాహనాలు, ద్విచక్రవాహనాలు, ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. పోలీసులు స్థానికుల సహకారంతో జేసీబీతో గడ్డి వామును, ట్రాక్టరును తొలగించారు. దాంతో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారమైంది. ఇక్కడ శాశ్వతంగా ఉండే బ్రిడ్జి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
7997958337, 7075709854, 7997958336

రచ్చబండపైనే చదువులు

నిధులు పుష్కలంగా ఉన్నాయి.. దాతలు ఉదారంగా స్థలమిచ్చారు.. అయినప్పటికీ పాఠశాల భవన నిర్మాణానికి కూటమి సర్కారు మీన మేషాలు లెక్కిస్తోంది. నాడు – నేడు నిధులతో ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మార్చిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం కోల్పోవడంతో బోడిగరువు విద్యార్థుల తలరాత మారలేదు. రచ్చబండపైన, ఇరు గదుల్లోనూ చదువుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

- దాతలు స్థలమిచ్చినా ప్రారంభం కాని పాఠశాల భవన నిర్మాణం
- గత ప్రభుత్వ హయాంలోనే రూ. 28 లక్షల మంజూరు
- ఉదాసీనంగా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వం
- 6 గిరిజన గ్రామాల విద్యార్థులకు తప్పని అవస్థలు
- చింతలపూడి పంచాయతీ బోడిగరువులో దుస్థితి



బోడిగరువులో రచ్చబండపై చదువుకుంటున్న గిరిజన విద్యార్థులు



భవనం లేక పోవడంతో ఇరుకు ఇంట్లో బోధిస్తున్న ఉపాధ్యాయులు



గత ప్రభుత్వం నాడు-నేడులో విద్యార్థులకు కూర్చునేందుకు సరఫరా చేసిన బెంచీలు

దేవరాపల్లి: మండలంలోని చింతలపూడి పంచాయతీ బోడిగరువు గిరిజన గ్రామంలో రచ్చబండపైన, ఇంటి ఇరుకు గదుల్లోను విద్యార్థులు చదువులు సాగిస్తున్న దయనీయ పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వం విద్యా రంగానికి ప్రాధాన్యత కల్పించి నాడు-నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలలు రూపురేఖలు మార్చింది. తాజాగా పగ్గాలు చేపట్టిన కూటమి ప్రభుత్వం విద్యా రంగంపై నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తోంది.

బోడిగరువులోని ప్రాథమిక పాఠశాలకు నేరెళ్లపూడితో పాటు మదనగరువు, కళ్యాణగుమ్మి, తట్టపూడి, కొట్టెంగూడ గ్రామాల నుంచి 33 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు.

గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు..

గతంలో నేరెళ్లపూడిలో పాఠశాల ఉండేది. మిగిలిన గ్రామాలకు దూరంగా ఉండటంతో పాటు విద్యార్థులు గెడ్డలు దాటి రావాల్సిన పరిస్థితి ఉండేది. అందరికీ అందుబాటులో ఉండే విధంగా మధ్యస్తంగా ఉన్న బోడిగరువు గ్రామంలో పాఠశాల ఏర్పాటు చేయాలని స్థానిక సర్పంచ్ దొమ్మంగి బోడెమ్మ, ఎంపీటీసీ బండి గౌరమ్మతో పాటు స్థానిక గిరిజనులు అప్పటి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సూచనతో పాఠశాల భవన నిర్మాణానికి గ్రామానికి చెందిన దాతలు గుమ్మడపు దేవి, దేముడుబాబు దంపతులు 9 సెంట్ల స్థలం ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. వెంటనే పాఠశాల భవన నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలోనే నాడు-నేడులో భవన నిర్మాణానికి రూ. 28 లక్షలు మంజూరు చేశారు. విద్యార్థులకు అవసరమైన బెంచీలు, టీవీ, ఇతర పరికరాలను సైతం అందజేశారు. గతేడాది డిసెంబర్ 24న సుమారు 5 కిలోమీటర్ల మేర కాలినడకన గ్రామానికి చేరుకొని ఈ భవన నిర్మాణానికి డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు భూమిపూజ చేశారు. ఆ తర్వాత ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో నిర్మాణ పనులు ముందుకు సాగలేదు. కూటమి అధికారంలోకి వచ్చి ఆరు నెలలు దాటిపోతున్నా పాఠశాల భవనం నిర్మించడంపై దృష్టి సారించడం లేదు. దీంతో స్థానిక విద్యార్థులు కొందరు చిన్నపాటి ఇంటి ఇరుకు గదిలో ఉండగా, మరికొందరు రచ్చబండపై చెట్టు నీడలో చదువులు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ నరకయాతన అనుభవిస్తున్నారు.



పాఠశాల భవన నిర్మాణానికి దాతలు ఇచ్చిన స్థలం ఇదే



పాఠశాల భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న అప్పటి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు(ఫైల్)

గిరిజనుల ఆగ్రహం

గిరిజన విద్యార్థుల పట్ల పాలకులు, అధికారులు చిన్నచూపు చూస్తుండటంపై వారి తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల భవన నిర్మాణానికి లక్షలాది రూపాయలు విలువ చేసే స్థలాన్ని ఉచితంగా ఇవ్వగా, గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ పనులు ప్రారంభించడంలో ఎందుకు అలసత్వం ప్రదర్శిస్తున్నారని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రారంభించాలని ముక్తకంఠంతో కోరుతున్నారు.

బోధనకు ఇబ్బందులు



పాఠశాల భవనం లేకపోవడంతో ఒక ఇంటిలో కొందర్నీ, రచ్చబండపై మరి కొందర్ని ఉంచి విద్యా బోధన చేస్తున్నాం. భవన నిర్మాణానికి స్థానికులు తొమ్మిది సెంట్ల స్థలాన్ని రాసిచ్చారు. నాడు-నేడులో పాఠశాల భవనం, ప్రహరీ, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ. 28 లక్షలు మంజూరయ్యాయి. ఈ స్కీమ్‌లో బెంచీలు, టీవీ, ఎలక్ట్రానిక్స్ సామగ్రి, టైల్స్ వచ్చాయి.

– జి.జగదీశ్వరరావు, హెచ్ఎం, బోడిగరువు గ్రామం

త్వరలో పనులు ప్రారంభిస్తాం



పాఠశాల భవన నిర్మాణానికి స్థానిక దాతలు 9 సెంట్ల స్థలం ఇచ్చారు. ఈ స్థలాన్ని ఎంపీడీవో, ఎంఈవో పేరిట రిజిస్ట్రేషన్ చేయించి, కలెక్టర్‌కు అందజేశాం. కలెక్టర్ నుంచి భవన నిర్మాణానికి అనుమతులు వచ్చాయి. త్వరలోనే మెటీరియల్ తెప్పించి, పనులు ప్రారంభించేలా చర్యలు చేపడతాం.

– బి.పడాల్‌దాస్, మండల విద్యాశాఖ అధికారి, దేవరాపల్లి

మొక్కలు పెంపకంతోనే కాలుష్య నివారణ

- ఎంపీపీ రాజారామ్



మాడుగుల ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటుతున్న ఎంపీపీ రాజారామ్ తదితరులు

మాడుగుల: మొక్కల పెంచడం ద్వారానే కాలుష్య నివారణ సాధ్యమవుతుందని ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ తెలిపారు. పల్లె వనం కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో ఉపాధి హామీ పథకంలో భాగంగా మొక్కులు నాటి మాట్లాడారు. నేరేడు, ఉసిరి, నిమ్మ, జామ, వంటి 102 మొక్కలు నాటామన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వేమవరపు రామధర్మజ, కూటమి నాయకుడు రంజిత్‌వర్మ, ఏపీవో మురళీ కృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్ పాపియ్యమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుతో ప్రజారోగ్యం



కొవ్వూరులో ఎంపీడీవో, సిబ్బందితో కలసి పారిశుధ్య పనులు చేస్తున్న మండల ప్రత్యేకాధికారి మనోహర్

రోలుగుంట: పారిశుధ్య పనుల నిర్వహణతోనే ప్రజారోగ్యం ఆధారపడి ఉంటుందని మండల ప్రత్యేకాధికారి జి. మనోహర్ తెలిపారు. శనివారం కొవ్వూరు గ్రామంలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ప్రత్యేకాధికారి పలుగు పార పట్టి ఎంపీడీవో నాగేశ్వరరావు, సర్పంచ్ యర్రంశెట్టి కాంతమ్మ, సచివాలయ సిబ్బందితో కలసి శరభవరం వెళ్లే రోడ్డులోను, వాటర్ ట్యాంకు వద్ద చెత్తా చెదారాలు తొలగించారు. దీనిలో భాగంగా స్థానిక చెత్తతో సంపద తయారీ శాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది రాజు, రమణ, ఏవో ఎస్.విజయలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హేమ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



వేచలంలో ర్యాలీ నిర్వహిస్తున్న మండల ప్రత్యేకాధికారి మంజులవాణి, తదితరులు



ఎస్సీ కాలనీలో పారిశుధ్యం పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి మూర్తి

దేవరాపల్లి: గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యకర సమాజం నిర్మాణం సాధ్యపడుతుందని డీఎల్‌డీవో, మండల ప్రత్యేకాధికారి మంజులవాణి అన్నారు. సర్పంచ్ నాగిరెడ్డి శతారినాయుడు ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా వేచలంలో ఎంపీడీవో ఎం.వి. సువర్ణరాజుతో కలిసి శనివారం ఆమె పర్యటించారు. పరిసరాల పరిశుభ్రతపై అధికారులకు సలహాలు సూచనలు చేశారు. అనంతరం లింగ ఆధారిత హింసకు వ్యతిరేకంగా అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. వెలుగు ఏపీఎం ఎస్.ప్రభాకర్, ఉపాధి ఏపీవో డి. చంద్రకళ, హౌసింగ్ ఇన్‌చార్జి ఏఈ ఎస్. భవ్యతేజ, ఎలక్ట్రికల్ ఏఈ కె.శంకరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

చీడికాడ: జైతవరంలో ఎంపీపీ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, సచివాలయంలో మండల ప్రతేకాధికారి కె.ఎల్.ఎన్.మూర్తి రికార్డులు పరిశీలించారు. అనంతరం బీసీ, ఎస్సీ కాలనీల్లో పారిశుధ్య నిర్వహణను పరిశీలించి తుప్పలను తొలగించాలని సూచించారు. ఎంపీడీవో హేమసుందరరావు, హెచ్‌డీటీ సత్యనారాయణ, ఉప సర్పంచ్ ఈర్లె చైతన్య, ఎంపీటీసీ పైల ముత్యాలనాయుడు పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎస్ఐ మల్లేశ్వరరావు తదితరులు

దేవరాపల్లి: కాశీపురం నిస్సీ మినిస్ట్రీస్‌కు చెందిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ టి.మల్లేశ్వరరావు, డీబీఎస్ వైస్ చైర్మన్ మధు ప్రకాష్ ఆవిష్కరించారు. వీరిని నిస్సీ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు బిషప్ గొర్లి టైటస్ ఘనంగా సత్కరించి, నూతన క్యాలెండర్‌ను అందజేశారు. ఫాస్టర్ జయరాజు, విఘ్నేష్ ల్యాబ్ ప్రతినిధి పవన్, రాజు, ప్రకాష్, ఉదయ్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

ఎంపీపీ మణికుమారి



మాట్లాడుతున్న ఎంపీపీ మణికుమారి

గొలుగొండ: ప్రజా సమస్యలు పరిష్కారం కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఎంపీపీ గజ్జలపు మణికుమారి తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పప్పుశెట్టిపాలెం, విప్పలపాలెం సర్పంచ్‌లు విజయలక్ష్మి, నల్లబెల్లి శ్రీనువాస్ మాట్లాడుతూ పెరిగిన విత్యుత్ చార్జీలు వల్ల సామాన్యులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. దీనికి విద్యుత్ శాఖ నుంచి ఎటువంటి సమాధానం రాకపోవడంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో కూటమి ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాలు గురించి సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు సమాచారం ఇవ్వడం లేదని ఆగ్రహించారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రజలు సహకారం లేకుండా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు ఎంపీడీవో మేరీ రోజ్‌ని నిలదీశారు. ఇక నుంచి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుర్ల బాబ్జి, అధికారులు పాల్గొన్నారు.

ప్రయోగాత్మక విజ్ఞానం పెంపొందించుకోవాలి



విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేస్తున్న అతిథులు

మాకవరపాలెం: విద్యార్థులు ప్రయోగాత్మక జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఆలిండియా రేడియో మన స్తత్వవేత్త బిజయలక్ష్మి సూచించారు. తామరం అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ విద్యార్థులతో సృజన 2K24 పేరుతో రెండు రోజులపాటు నిర్వహించిన సాంకేతిక సదస్సులు శనివారంతో ముగిశాయి. ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ర్యాంకులపైనే కాకుండా యాజమాన్యాలు ఇలాంటి సాంకేతిక ప్రదర్శనలు ఏర్పాటు చేయడం ద్వారా విషయ పరిజ్ఞానం పెంపొందుతుందన్నారు. అచ్యుతాపురం మెకాట్రానిక్స్ ప్రొఫెసర్ మురళీకృష్ణ మాట్లాడుతూ నైపుణ్యంతో విజయాలను సొంతం చేసుకోవచ్చన్నారు. ప్రిన్సిపాల్ మోహన్‌రావు మాట్లాడుతూ బహుమతులు రాని విద్యార్థులు నిరుత్సాహ పడొద్దని, పోటీలో పాల్గొనడమే విజయాలకు తొలిమెట్టన్నారు. అనంతరం ఉత్తమ నమూనాలను ప్రదర్శించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ మండలాధ్యక్షురాలిగా అమ్మాజి



కె.కోటపాడు: బీజేపీ మండలాధ్యక్షురాలిగా పైల అమ్మాజి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపు రెడ్డి పరమేశ్వరరావు సమక్షంలో ఈ ఎన్నిక నిర్వహించారు. ఆమెను కొట్టాన ఈశ్వరరావు, కూండ్రపు గంగునాయుడు ప్రతిపాదించారు. మండలంలో పార్టీ పటిష్టతకు శక్తివంచన లేకుండా కృషి చేయనున్నట్లు అమ్మాజి తెలిపారు. పార్టీ నాయకులు శరగడం సన్యాసినాయుడు, బండారు సత్యనారాయణ పాత్రుడు, ఇమంది సన్యాసిరావు పాల్గొన్నారు.

ఎస్సీ కులగణనపై 31లోగా అభ్యంతరాల స్వీకరణ



పైడిపాలలో ఎస్సీ జాబితాను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి

మాడుగుల రూరల్: ఎస్సీ కుల గణన వివరాలను ఈ నెల 26వ తేదీన గ్రామ సచివాలయాల్లో ప్రదర్శించారు. వీటిపై అభ్యంతరాలను ఈ నెల 31వ తేదీ వరకు స్వీకరిస్తామని ఎంపీడీవో కోంకి అప్పారావు శనివారం తెలిపారు. జనవరి 6వ తేదీ వరకు అభ్యంతరాలపై క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామని, సమగ్ర వివరాల సేకరణ అనంతరం అదే నెల 10న కుల గణన తుది వివరాలను సచివాలయాల్లో ప్రదర్శిస్తామన్నారు.

మాకవరపాలెం: దళితులు తమ అభ్యంతరాలను ఈ నెల 31లోగా తెలియజేయాలని మండల ప్రత్యేకాధికారి రామ్మోహన్‌రావు తెలిపారు. మండలంలోని పైడిపాల, తామరం, పెద్దిపాలెంలో చెత్త సంపద కేంద్రాలతోపాటు సచివాలయాలను ఆయన శనివారం సందర్శించారు. అనంతరం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో పాల్గొని చెత్తను తొలగించారు. ఎంపీడీవో సీతామహాలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో దూషణలు

ఇరువర్గాల తీరుతో చేతులెత్తేసిన అధికారులు



పీజీఆర్ఎస్ వేదికలో అధికారులు, ఫిర్యాదుదారుల మధ్య వాగ్వాదం

నాతవరం: మండల స్థాయి కమిటీ ఆధ్వర్యంలో పీజీఆర్ఎస్ అర్జీలపై శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా మండల ప్రత్యేకాధికారి నాగశిరీష మాట్లాడుతూ పంతాలకు పట్టింపులకుపోతే తామేమీ చేయలేమన్నారు. ఎక్కడికెళ్లినా సమస్య పరిష్కారం కాదన్నారు. అనంతరం అర్జీల పరిష్కారానికి అధికారులు క్రమ సంఖ్యలో చర్యలు చేపడుతున్న తరుణంలో వెదురుపల్లి గ్రామానికి చెందిన భూ సమస్యపై ఇరువురు తగాదా పడ్డారు. ఎస్ఐ సిహెచ్ భీమరాజు, తహసీల్దార్ వేణుగోపాల్ కల్పించుకుని తమ ముందు ఇలా తగాదా పడితే ఇరువురిపై కేసు పెడతామని హెచ్చరించారు. మిగతా గ్రామాల నుంచి వచ్చిన వారు సైతం ఇదే ధోరణిలో వ్యవహరించడంతో ఒక్క సమస్యా పరిష్కారం కాలేదు. అధికారులు విసుగుచెంది ఏమి చేయకుండానే మధ్యలో లేచిపోయారు. వారంతా వచ్చే సోమవారం రావాలంటూ ఎంపీడీవో కె.ఉషశ్రీ ఆదేశించారు.

చీడికాడ: సివిల్ సమస్యలపై మండల స్థాయి కమిటీ శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల ప్రత్యేకాధికారి కె.ఎల్.ఎన్. మూర్తి ఆధ్వర్యంలో విచారణ చేపట్టింది. దండిసురవరం, అప్పలరాజుపురం, జైతవరం గ్రామాలకు చెందిన పలువురు తమ కుటుంబాల్లో భూ సమస్యలపై ఫిర్యాదు చేసుకున్నారు. రెండో వర్గం వారు రాకపోవడంతో ఈ సమస్యలు పరిష్కారం కాలేదు. ఎంపీడీవో హేమసుందరరావు, తహసీల్దార్ ప్రసాదరావు, ఎస్సై బి.సతీష్ పాల్గొన్నారు.

ఉపాధి పని దినాలను 200కు పెంచాలి

దేవరాపల్లి: ఉపాధి కూలీల పని దినాలను 200 రోజులకు పెంచాలని, రోజువారి కనీస వేతనం రూ. 600 ఇవ్వాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి. వెంకన్న డిమాండ్ చేశారు. శనివారం దేవరాపల్లిలో ఆయన మాట్లాడుతూ నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో ప్రస్తుతం చెల్లిస్తున్న కూలి ఏమాత్రం సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూలీల బకాయి సొమ్మును వెంటనే విడుదల చేయాలన్నారు. పాలకుల నిర్లక్ష్య వైఖరితో ఉపాధి హామీ పథకం అవినీతి, అవకతవకలకు నిలయంగా మారిందని ఆరోపించారు.

అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతులకు ప్రతిపాదనలు

గొలుగొండ ఐసీడీఎస్ పీవో శ్రీగౌరీ



అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త సత్యవతికి సూచనలు చేస్తున్న ఐసీడీఎస్ పీవో శ్రీగౌరీ

నాతవరం: గొలుగొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మరమ్మతులకు గురైన అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు మరమ్మతులు చేసేందుకు ప్రతిపాదనలు చేశామని పీవో శ్రీగౌరీ తెలిపారు. ఆమె శనివారం నాతవరం అంగన్‌వాడీ కేంద్రం-1ను తనిఖీ చేసారు. రికార్డులను స్టాకును పరిశీలించి కేంద్రం నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యకర్త, ఆయా బాధ్యతగా పని చేస్తే కేంద్రాలు శుభ్రంగా ఉంటాయన్నారు. కేంద్రం ఆవరణలో సేంద్రీయ ఎరువులతో పండిస్తున్న కూరగాయలు పంటలను చూసి కార్యకర్త సత్యవతి, ఆయా జ్యోతిలను అభినందించారు, చిన్నారుల క్రమశిక్షణ చూసి సంతోషించారు. అనంతరం పీవో మాట్లాడుతూ కేంద్రాల నిర్వహణతో పాటు పని తీరులో మరింత మార్పు కోసం దృష్టి సారించామన్నారు. వచ్చే నెల నుంచి అంగన్‌వాడీ కేంద్రం నుంచి ఎలాంటి సంక్షేమ పథకాలు పొందాలన్నా ఆధార్ కార్డు ఉంటేనే ప్రభుత్వం అందిస్తుందన్నారు. సూపర్‌వైజర్లు విజయలక్ష్మి నాగజ్యోతి పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో ఆరోగ్యకర పంటల దిగుబడి

- చోడవరం ఏడీఏ రవీంద్రనాథ్



వరి విత్తన నమూనాలను పరిశీలిస్తున్న ఏడీఏ రవీంద్రనాథ్, ఏవో కాంతమ్మ

దేవరాపల్లి: ఆధునిక పద్ధతుల్లో తక్కువ మోతాదులో యూరియా, పురుగుల మందులను వినియోగించి సాగు చేయడం ద్వారా ఆరోగ్యకరమైన పంటలు దిగుబడి వస్తాయని చోడవరం ఏడీఏ వి.రవీంద్రనాథ్ అన్నారు. ఆధునిక పద్ధతుల్లో పండించిన కొత్తపెంటకు చెందిన 21 మంది రైతుల నుంచి వరి విత్తన నమూనాలను సేకరించే కార్యక్రమాన్ని శనివారం ఆయన పర్యవేక్షించారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఏవో వై. కాంతమ్మ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ జరిగింది. ఏడీఏ మాట్లాడుతూ విత్తన నమూనాలను బెంగళూరులోని విత్తన ధ్రువీకరణ పరిశోధన సంస్థకు పంపిస్తామన్నారు. వీటి నాణ్యత బాగున్నట్లు రిపోర్టు వస్తే సదరు రైతులంతా ఆన్‌లైన్‌లో వరి విత్తనాలు విక్రయించుకోవచ్చన్నారు. మార్కెట్లో గిట్టుబాటు ధర కల్పించడంలో భాగంగా ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. మండల వ్యవసాయ విస్తరణాధికారి ఎస్.కిరణ్‌కుమార్, అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నర్సీపట్నం డివిజన్:
నర్సీపట్నం : 9010234557
చోడవరం : 9010210265
మాడుగుల : 9010546644
Office mail : sakshiadvtvsp@gmail.com